సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 21 । జూన్ । 2025



... పోడు వివాదం..
ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లోని కొనగుంపు వలన ఆదివాసీ గ్రామంలో పోడు భూములపై శుక్రవారం వివాదం నెలకొంది. 8లో



చదువు 'కొనగలుగుతారా'..?
జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల చదువులకు మోపే ఆర్థిక భారాన్ని తల్లిదండ్రులు భరించలేకపోతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం
జిల్లాలో శనివారం పగటి వేళ ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతంగా మారే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతిని సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు టెట్ ప్రశాంతం

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో మూడో రోజు శుక్రవారం నిర్వహించిన టీజీ టెట్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 120 మంది అభ్యర్థులకు గాను మొదటి షిఫ్ట్‌లో 98 మంది, రెండో షిఫ్ట్‌లో 110 మంది హాజరయ్యారు. రెండు షిఫ్టుల్లో కలిపి 32 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆయిల్‌ఫెడ్ ఎండీ ఆకస్మిక పర్యటన



ఆయిల్‌పామ్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

అశ్వారావుపేట: ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్య శుక్రవారం ఆకస్మిక పర్యటించారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ఆయిల్‌పామ్ నర్సరీ, ఫ్యాక్టరీలను సందర్శించారు. గెలల దిగుమతి, క్రషింగ్, నూనె రికవరీ, ఉప ఉత్పత్తులు, నిర్వహణ తదితర వివరాలు తెలుసుకున్నారు. నారంవారిగూడెం నర్సరీలో మొక్కల పెంపకంపై ఆరా తీశారు. కాగా శంకరయ్య ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అశ్వారావుపేట డివిజన్‌కు రావడం ఇదే మొదటిసారి. ఆయన వెంట పీఅండ్‌పీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రాధాకృష్ణ, నాగబాబు, కళ్యాణ్ ఉన్నారు.

ముగిసిన కేంద్ర పథకాల నమోదు క్యాంపులు

భద్రాచలంటౌన్: గిరిజన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ యోజన పథకాల నమోదు కోసం నిర్వహించిన క్యాంపులు ముగిసినట్లు పీఓ రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో 30 గ్రామాల్లో క్యాంపులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 30 సదస్సులు నిర్వహించగా, 3,807 మంది గిరిజనులు పీఎం కిసాన్, ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, జనధన్, కులం సర్టిఫికెట్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్డుల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని, 1,955 మందికి రిజిస్ట్రేషన్ చేశామని వివరించారు.

త్వరలో సీఎం రాక?

ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి శంకుస్థాపన
- యంగ్ ఇండియా పాఠశాలల ప్రారంభోత్సవం
- స్థానిక ఎన్నికలకు ముందు పార్టీలో జోష్ తెచ్చేలా పర్యటనకు ప్రణాళిక



సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉందా అంటే అధికార పార్టీ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఇటీవల జిల్లాకు మంజూరైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ముఖ్యమంత్రిని జిల్లాకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

దేశంలో ఏకైక వర్సిటీ

దేశంలోనే మొట్టమొదటి ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీని జిల్లాకు మంజూరు చేశారు. ఈ కాలేజీలో అందించాల్సిన కోర్సులపైనా ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. మరోవైపు కేంద్రం నుంచి నవోదయ స్కూల్/కాలేజీ జిల్లాకు మంజూరైంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ పనులను సీఎంతో లాంఛనంగా ప్రారంభింపజేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలోనే కొత్త యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ వర్సిటీ భవన నిర్మాణాలు, ఎక్విప్‌మెంట్ కోసం రూ.200 కోట్ల వరకు కేటాయించే అవకాశం ఉంది.

స్థలసేకరణ అయితే

జిల్లాకు ఐదు యంగ్ ఇండియా స్కూల్స్ మంజూరయ్యాయి. ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ప్రతీ పాఠశాలను కనీసం 15 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కొత్తగూడెం, పినపాకలలో స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించారు. ఇల్లెందు విషయంలో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా పరిస్థితి ఉంది. అశ్వారావుపేట, భద్రాచలం విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. స్థల సేకరణ పూర్తయితే ఐదు యంగ్ ఇండియా స్కూళ్ల పనులకు ఒకేసారి సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలను ఏకం చేస్తూ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఈ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో కేటాయించిన రూ.300 కోట్లతో చేపట్టబోయే పనులకు సీఎం చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టించవచ్చనే అంశంపై కూడా హస్తం నేతలు దృష్టిపెట్టారు.

ప్రారంభోత్సవాలు

పర్యాటక రంగం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సీఎం జిల్లా టూర్ ఖరారైతే అందులో శంకుస్థాపనలతో పాటు ప్రారంభోత్సవాలు కూడా ఉండేలా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. దాదాపు పదేళ్లుగా నిర్మాణం సాగుతున్న హరిత కన్వెన్షన్ సెంటర్, హరితా హోటళ్లతో పాటు కిన్నెరసాని ఎకో టూరిజం కాటేజీలను ప్రారంభించేందుకు యత్నిస్తున్నారు. దీంతో చివరి దశలో ఉన్న పనులను మరింతగా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు మరోసారి ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అతి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు, మంత్రులు నియోజకవర్గస్థాయిలో పార్టీ కేడర్‌ను ఉత్తేజపరిచే పనిలో ఉన్నారు. పైగా తెలంగాణ వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉంది. దీంతో ఇక్కడి నుంచే పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని మొదలుపెట్టే ఆలోచనలో హస్తం పార్టీ నేతలు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



రామాంజనేయపురంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎమ్మెల్యే ఆదినారాయణ, టీఎస్ ఐడీసీ చైర్మన్ విజయ్‌బాబు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు

- నాలుగేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల గృహాలు నిర్మిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి

ములకలపల్లి/చండ్రుగొండ: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, టీఎస్ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ములకలపల్లి మండలం రామాంజనేయపురం గ్రామంలో బత్తుల పుష్పలత, చెన్నకేశవులు దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం గుర్రాలకుంట, చింతలపాడు, అన్నారం గ్రామాల శివార్లలోని వాగులపై రూ.5.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మూడు హైలెవల్ వంతెనల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. చండ్రుగొండ మండలం తిప్పనపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. దామరచర్ల, సీతాయిగూడెం మధ్య ఉన్న ఎదుళ్ల వాగుపై హైలెవల్ బ్రిడ్జీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోవు నాలుగేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థికపరిస్థితి అథోగతికి చేరిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం పేరిట రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ పాలకులు ఖాళీ చేశారని ఆరోపించారు. ఇక్కడి వెంగళరాయసాగర్ అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 33.55 కోట్లు ప్రాజెక్ట్ అభివృద్ధికి మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రన్ శుక్రవారం ములకలపల్లి మీదుగా వెళ్తుండగా, మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఒలింపిక్ జ్యోతితో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, అధికారులు భూక్యా గనియా, రవికిరణ్, గద్దె రేవతి, అరుణ్‌బాబు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, నాయకులు తాండ్ర ప్రభాకర్‌రావు, కారం సుధీర్, భూక్యా పత్తీలాల్, సున్నం సుధాకర్, గాడి తిరుపతి రెడ్డి, శనగపాటి రవి, కె.రవి పాల్గొన్నారు.

బయోచార్‌తో భూసారం..



క్యాంపు కార్యాలయంలో తయారైన బయోచార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మండలపల్లి రైతు వేదికలో బయోచార్ తయారీపై వివరిస్తున్న ఏడీఏ రవికుమార్

- కలెక్టరేట్‌లో తొలిసారిగా ప్రయోగాత్మక ప్రదర్శన
- గ్రామానికో రైతు బయోచార్ వినియోగించేలా చర్యలు
- సేంద్రియ కర్బనం పెంపొంది అధిక, నాణ్యమైన పంట ఉత్పత్తులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యవసాయాన్ని సహజంగా మార్చుకునే క్రమంలో బయోచార్ వినియోగం ఇటీవల అందుబాటులోకి వచ్చింది. పంట వ్యర్థాలతో రైతులే స్వయంగా దీనిని తయారు చేసుకుని సాగు భూముల్లో వేసుకోవచ్చు. జిల్లాలో మొదటి సారిగా గత నెలలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ క్యాంపు కార్యాలయంలో బయోచార్ తయారీకి శ్రీకారం చుట్టారు.

ఇవీ ఉపయోగాలు

బయోచార్ అనేది ఎరువు కాదు. కానీ పంటలకు వేసే ఎరువుల వినియోగ సామర్థ్యం 30–40 శాతం పెంచుతుంది. మట్టిలో పేరుకుపోయిన రసాయన అవశేషాలను తొలగించేందుకు తోడ్పడుతుంది. సాగునీటిలో విషాలను హరించివేస్తుంది. దీన్ని బయో (జీవం), చార్ (చార్‌కోల్ బొగ్గు) జీవం ఉన్న బొగ్గుగా పేర్కొనవచ్చు. నేలసారానికి సేంద్రియ కర్బనం అవసరం. ఇది మట్టిలో స్థిరంగా ఉండదు. దీన్ని పెంపొందించేందుకు బయోచార్ ఉపయోగపడుతుంది. తద్వారా అధిక దిగుబడులు, నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చు.

తయారీ ఇలా..

పత్తి కట్టె, మిరపకట్టె, మొక్కజొన్న చొప్ప, వేరుశెనగ పొట్టు, వరి పొట్టు, పొగాకు మోడ్లు తదితర వ్యర్థ పదార్థాలను తగులబెట్టే బదులు వీటితో బయోచార్ తయారు చేయవచ్చు. తుమ్మవంటి కంప చెట్ల కలపతో, జీడి గింజల పైపెంకులతో కూడా బయోచార్ తయారు చేయవచ్చు. పరిమితంగా గాలి సోకేలా లేదా పూర్తిగా గాలి సోకకుండా ప్రత్యేక పద్ధతిలో పెద్దగా పొగ రాకుండా 450 డిగ్రీల నుంచి 750 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతతో కాల్చితే (ఈ ప్రక్రియను పైరోలైసిస్ అంటారు) తయారయ్యే నల్లని కట్టె బొగ్గే బయోచార్. రైతులు ఇనుప డ్రమ్ముల్లో లేదా కందకం తవ్వి కూడా బయోచార్‌ను తయారు చేయవచ్చు.

నేరుగా వేయకూడదు..

బయోచార్‌ను నేరుగా పొలాల్లో వేయకూడదు. బయోచార్ కంపోస్టును తయారు చేసుకుని వేయాలి. మాగిన పశువుల ఎరువు లేదా వర్మి కంపోస్టు లేదా జీవామృతం లేదా పంచగవ్య వంటి ఏదైనా సేంద్రియ ఘన/ద్రవ ఎరువుల్లో ఏదో ఒక దానిని బయోచార్‌తో సమపాళ్లలో కలపాలి. కుప్పగా వేసి బెల్లం నీటిని చిలకరిస్తూ రోజు కలియ తిప్పుతూ ఉంటే 15 రోజుల్లో బయోచార్ కంపోస్టు తయారవుతుంది. సాగు భూముల్లో మట్టి గుణాన్ని బట్టి తగిన మోతాదులో వేసుకోవాలి.

తొలుత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో..

జిల్లాలోని ప్రతీ గ్రామంలో కనీసం ఒక రైతైనా బయోచార్ తయారుచేసి పంటసాగులో వాడేలా చూడాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఇప్పటికే వ్యవసాయాధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మొదట బయోచార్ తయారు చేయగా, ప్రస్తుతం వ్యవసాయాధికారులు వివిధ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా బయోచార్ తయారీ చేపడుతున్నారు.

సింగరేణిలో పర్సనల్ విభాగం అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని పర్సనల్ విభాగంలో నలుగురు అధికారులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్ ఎడ్యుకేషన్ విభాగంలో డీవైపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న రాజేశ్వరరావును బెల్లంపల్లి ఏరియా పర్సనల్ విభాగానికి, వెల్ఫేర్ వింగ్ కార్పొరేట్ డీవైపీఎం జీకే కిరణ్‌కు మార్‌ను కార్పొరేట్ ఎడ్యుకేషన్ విభాగానికి బదిలీ చేసింది. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ–3లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా పనిచేస్తున్న వేల్పుల కిశోర్‌ను అదే ఏరియాలోని కేటీకే–1 ఇంక్‌లైన్‌కు, సింగరేణి మెయిన్ ఆస్పత్రి సీనియర్ పీఓ మండల శ్రీనివాస్‌ను కార్పొరేట్ ఏరియా వెల్ఫేర్ వింగ్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

చుంచుపల్లి: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. చుంచుపల్లి మండలంలోని నందాతండా, ధన్ బాద్, గౌతంపూర్, రుద్రంపూర్, పెనగడప గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, నాయకులు ఆళ్ల మురళి, పెదబాబు, అంతోటి పాల్, చింతలపూడి రాజశేఖర్, జేవీఎస్ చౌదరి, వై.శ్రీనివాస్ రెడ్డి, బోదాసు కనకరాజు, ఎండి రజాక్, పీతాంబరం తదితరులు పాల్గొన్నారు.

దర్శనం, ఆర్జిత సేవలకు ఇక ఈ–టికెట్లు..

- ట్రయల్ రన్ నిర్వహించిన దేవస్థానం ఈఓ
- ఇప్పటికే రామాలయంలో డిజిటల్ సేవలు



మిషన్ ద్వారా టికెట్లను కొనుగోలు చేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో డిజిటల్ సేవలు భక్తులకు మరింత చేరువ అవుతున్నాయి. ఇప్పటికే పలు విభాగాల్లో డిజిటల్ సేవలు అందుతుండగా తాజాగా స్వామివారి దర్శన, ఆర్జిత టికెట్లు పొందేందుకు మిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం శుక్రవారం ఆలయంలో ట్రయల్ రన్ నిర్వహించారు. మూడు మిషన్లను ఫెడరల్ బ్యాంక్ అధికారులు ఉచితంగా అందించగా, పడమెర మెట్ల వైపు ఒకటి, లడ్డూ కౌంటర్ల వద్ద రెండు మిషన్లను ఏర్పాటు చేయనున్నారు. యంత్రాలతో భక్తుల సమయం ఆదా అయ్యే అవకాశం ఉంది. మరికొన్ని మిషన్లను దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు బ్యాంకర్లతో దేవస్థానం అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

భద్రాచలం టెంపుల్ ఇన్ఫర్మేషన్ యాప్..

రామాలయ సమస్త సమాచారం లభించేలా భద్రాచలం టెంపుల్ ఇన్ఫర్మేషన్ (బీటీఐ) యాప్ రూపొందించారు. తెలంగాణలోనే తొలిసారిగా యాప్‌ను రూపొందించి భక్తులకు చేరువైన దేవస్థానంగా రామాలయం నిలిచింది. ఇందులో ఆలయానికి సంబంధించిన 22 రకాల సేవల వివరాలు లభ్యమవుతాయి. సేవలు పొందే ప్రదేశాలతో గూగుల్ మ్యాప్‌ను అనుసంధానించారు. భద్రాచలం, చుట్టు పక్కల ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఉపాలయాలు, సందర్శనీయ స్థలాల వివరాలు కూడా పొందుపర్చారు.

త్వరలో అకౌంట్లు సైతం..

త్వరలో అకౌంటింగ్ సెక్షన్‌ను సైతం డిజిటల్‌గా మార్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రికార్డుల నిర్వహణలో ఉద్యోగుల చేసే తప్పులకు ఆడిటింగ్ సమయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు, అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు రికార్డులను కంప్యూటరైజ్ చేయనున్నారు. దీంతో ఉద్యోగులకు పని ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ఈఓ రమాదేవి సాఫ్ట్‌వేర్ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు. మరో నెల రోజుల్లో రికార్డులు సైతం కంప్యూటరైజ్ చేసే అవకాశం ఉంది.

డిజిటల్‌మయంగా రామాలయం

రామాలయం డిజిటల్‌మయంగా మారుతోంది. తొలుత దేవస్థాన వెబ్‌సైట్ ఆధునికీకరించారు. లడ్డూ కౌంటర్లలో టికెట్లను కంప్యూటరైజ్ చేశారు. నిత్యాన్నదానం, గోశాలకు విరాళాలు ఇచ్చే వారి వివరాల నమోదుతో పాటు దాతలకు ఆన్‌లైన్ రశీదులు అందజేస్తున్నారు. స్వామివారి వస్త్రాల విక్రయాలకు బార్‌కోడ్ రూపొందించారు. ప్రొటోకాల్ దర్శనానికి వచ్చే వారికి స్కాన్‌తో ఫొటో తీసి ఎంట్రీ టికెట్ అందజేస్తున్నారు. అన్నదానానికీ ఈ–టోకెన్ ఇస్తున్నారు. ఇలా అన్ని విభాగాల్లో డిజిటల్ సేవలను విస్తరింపజేశారు.

సులభంగా సేవలు పొందేలా..

ఒక్కొక్కటిగా భక్తులకు డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. భక్తులకు సమయం ఆదా, సులభరీతిలో సేవలు అందేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. యాప్, ఆన్‌లైన్‌లో సేవలతోపాటు తాజాగా కియోస్కి మిషన్ల ద్వారా దర్శన, ప్రసాద టికెట్లను విక్రయించే చర్యలు చేపట్టనున్నాం. వీటిపై ట్రయల్‌రన్ నిర్వహించాం.
– ఎల్.రమాదేవి, రామాలయ ఈఓ

ఇల్లెందు ఆస్పత్రి ఉద్యోగులకు ప్రశంస



ప్రశంసా పత్రాలు అందుకున్న ఆస్పత్రి ఉద్యోగులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా ఆస్పత్రి ఉద్యోగులకు వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. జిల్లాలోని ఆరు ఏరియా ఆస్పత్రుల్లో మెరుగైన పనితీరు కనబరిచిన ఉద్యోగులను గుర్తించి శుక్రవారం కలెక్టరేట్‌లో పత్రాలు అందజేశారు. ప్రశంసలు అందుకున్న వారిలో ఇల్లెందు నుంచి డాక్టర్ హర్షవర్ధన్, రాంనివాస్, బన్సీలాల్, ఎల్‌టీ రాజేష్, ఫార్మసీ శ్రీలత, నర్సింగ్ ఆఫీసర్లు షర్మిల, భారతి, ఫర్జానా, సెక్యూరిటీ శ్రీను, శానిటేషన్ సూపర్‌వైజర్ రాము, ఉదయ్, సాయికృష్ణ ఉన్నారు.

వాడీవేడిగా డీసీసీబీ మహాజన సభ



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన డీసీఓ గంగాధర్, సీఈఓ వెంకటఆదిత్య తదితరులు

- మినిట్స్ బుక్ లేకపోవడంపై సభ్యుల మండిపాటు
- డిపాజిట్లు, ఇతర అంశాలపై ప్రశ్నల వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) 127వ మహాజన సభ వాడీవేడిగా సాగింది. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు అధ్యక్షతన సభ నిర్వహించగా, తొలుత వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా సహకార సంఘాల చైర్మన్లు పలువురు తీర్మానాలను మినిట్స్ బుక్‌లో రాయాలని సూచించగా.. అధికారులు బుక్ తీసుకురాలేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాజన సభకు మినిట్స్ బుక్ లేకుండా హాజరుకావడం ఏమిటంటూ సమోసాలు, టీ కోసం వచ్చామా అని ప్రశ్నించారు. కాగా, 2007–08లో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వారి నుంచి రూ.90 కోట్లు డిపాజిట్లు సేకరిస్తే, ఆ డిపాజిట్ల చెల్లింపుపై గత సభలో చేసిన తీర్మానం అమలుకు నోచుకోలేదని పలువురు తెలిపారు. వడ్డీ కలిపి రైతులకు చెల్లించాల్సి ఉందని చెప్పడంతో త్వరలోనే చెల్లిస్తామని బ్యాంకు సీఈఓ వెంకటఆదిత్య బదులిచ్చారు. కాగా, పీఏసీఎస్‌లు పటిష్టంగా ఉన్న ప్రాంతాల్లో డీసీఎంఎస్, ఇతర సంస్థల ద్వారా ధాన్యం కొనుగోలుపై అవకాశం కల్పించటం సరికాదని పేర్కొన్నారు. అలాగే, ధాన్యం కొనుగోళ్ల సమయాన నియమించే సిబ్బంది వేతనాల విషయమై ప్రశ్నించగా కమీషన్ నుంచి వేతనాలు చెల్లించవచ్చని జిల్లా సహకార అధికారి గంగాధర్ తెలిపారు. అలాగే, బ్యాంకు రుణాల నుంచి వసూలు చేసే వాటాధనంలో సహకార సంఘాలకు భాగం ఇచ్చేలా తీర్మానానికి పలువురు పట్టుబట్టారు. అంతేకాక 2023 నుంచి మొక్కజొన్నల కొనుగోళ్లపై రూ.లక్షల్లో రావాల్సిన కమీషన్ చెల్లించాలని కోరగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ సమావేశం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని మార్క్‌ఫెడ్ జీఎం సునీత తెలిపారు. ఇంకా భద్రాద్రి జిల్లా కేంద్రంలో ఎరువుల స్టాక్ పాయింట్ ఏర్పాటు, సహకార సంఘాల ఉద్యోగుల బదిలీలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, బ్యాంకు డైరెక్టర్లు గొర్ల సంజీవరెడ్డి, లక్కినేని సురేందర్‌రావు, లక్ష్మణ్‌రావు, ప్రసాద్, సైదులు, డీఆర్‌డీఓ అవధానుల శ్రీనివాసరావు, అధికారులు, పీఏసీఎస్‌ల చైర్మన్లు పాల్గొన్నారు.

సభ్యులకు బీమా పెంపు

పీఏసీఎస్‌ల నుంచి పంట రుణాలు తీసుకునే సభ్యులకు గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పరిమితిని పెంచుతూ పాలకవర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం రూ.50 వేలుగా ఉన్న బీమా పరిమితిని రూ.లక్షకు పెంచారు. అలాగే, 2024–25లో బ్యాంకు గడించిన లాభాల్లో రూ.530.55 కోట్లను సహకార సంఘాలకు డివిడెంట్(ఆరు శాతం)గా చెల్లించాలని నిర్ణయించింది. అంతేకాక ఉద్యోగులకు 8–12 శాతం(దూరం ఆధారంగా) అలవెన్స్ చెల్లింపునకు నిర్ణయించారు.

అక్రమాలపై విచారణకు నిర్ణయం

ఇళ్ల స్థలాలకు సంబంధించి నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి రూ.6 కోట్ల రుణాలు తీసుకున్న వ్యవహారంపై విచారణ చేపట్టాలని డీసీసీబీ పాలకవర్గం నిర్ణయించింది. మహాజన సభకు ముందుగా బ్యాంకు పాలకవర్గ సమావేశం జరగగా ఈ అంశాన్ని కొందరు సభ్యులు ప్రస్తావించారు. దీంతో బ్యాంకు సొమ్మును పక్కదారి పట్టించిన ఉద్యోగులపై చర్యలు తీసుకునేలా విచారణకు నిర్ణయించారు.

క్లుప్తంగా

పాత విధానంలోనే పంట రుణాలు ఇవ్వాలి


వినతిపత్రం ఇస్తున్న పీఏసీఎస్‌ల చైర్మన్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 1/70 చట్టం కారణంగా రైతులకు పంట రుణాల జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నందున, గతంలో మాదిరి పహానీల ఆధారంగా రుణాలు ఇవ్వాలని పలుపీఏసీఎస్‌ల చైర్మన్లు కోరారు. ఈ సందర్భంగా ఖమ్మంలో శుక్రవారం జరిగిన డీసీసీబీ మహాసభలో జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, డీసీసీబీ సీఈఓ వెంకట్‌ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు. అలాగే, ఏజెన్సీ రైతులు సహకార బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ, కొత్తగూడెం, మేడేపల్లి, కొణిజర్ల పీఏసీఎస్‌ల చైర్మన్లు కొత్వాల శ్రీనివాసరావు, మండే హన్మంతరావు, సామినేని వెంకటేశ్వరరావు, చెరుకుపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీల బదిలీ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో ఐదేళ్లకు పైబడి ఒకేచోట పని చేస్తున్న ఉపాధ్యాయుల(సీఆర్‌టీ)ను బదిలీ చేశారు. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న 64మంది సీఆర్‌టీలకు సబ్జెక్టుల వారీగా శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చినట్లు డీడీ విజయలక్ష్మి తెలిపారు. ఆ తర్వాత బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 3,5,8వ తరగతుల్లో ప్రవేశానికి అందిన దరఖాస్తుల ఆధారంగా తల్లిదండ్రులు, కమిటీ సభ్యుల సమక్షాన డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేశామని డీడీ వెల్లడించారు. కార్యక్రమాల్లో వైరా ఏటీడీఓ జహీరుద్దీన్, ఏఓ నారాయణ రెడ్డి, ఏసీఎంఓలు రాములు, రమేష్, హెచ్‌డబ్ల్యూఓలు హన్మంతరావు, రాంబాబు, రాజేందర్, నర్సింహారావు, శ్రీనివాసరావు, ధనుష్, భద్రాచలం ఎంఈఓ రమతో పాటు అలివేలు మంగతాయారు, రంగయ్య, ప్రసాద్, శ్రీధర్, మణికుమార్, సురేశ్, భద్రం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతసాగర్‌కు చెందిన వట్టికూటి జగదీష్(27) మృతి చెందాడు.ఆయన ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి అనంతసాగర్ వస్తుండగా పందిళ్లపల్లి సేషన్ సమీపాన ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జగదీష్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన తండ్రి నాసరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చదువుకొనగలుగుతారా..?

ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారాజ్యం

- పుస్తకాల పేరుతోనూ దోపిడీ..
- కానరాని మైదానాలు, ఫీజుల పట్టికలు
- ఆర్థికభారంతో అవస్థలు పడుతున్న తల్లిదండ్రులు
- పర్యవేక్షణపై పట్టింపు లేని అధికారులు



కొత్తగూడెంఅర్బన్: పిల్లలను అత్యున్నస్థాయిలో చూసేందుకు తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలో చేర్పిస్తుంటారు. కానీ, ఆయా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు మోపే ఆర్థిక భారాన్ని భరించలేకపోతున్నారు. తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వారు అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలు కూడా మెరుగైన సౌకర్యాలతో ప్రైవేట్‌కు దీటుగా మారుతున్నాయి. విద్యాబోధన కూడా అదేస్థాయిలో ఉండటంతో పేద, మధ్యతరగతి వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ఉన్న దగ్గర ఐదు కిలోమీటర్ల వరకు మరో ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేయడానికి వీలు లేదు. నిబంధనలు కూడా ఒప్పుకోవు. కానీ, విద్యాధికారుల సహకారం ఉండడం వల్ల పాఠశాలలు ఏర్పాటు చేసుకొని లక్షల్లో దోచుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 220కి పైగా ప్రైవేట్ పాఠశాలలున్నాయి. అందులో ఎన్ని పాఠశాలలకు అనుమతులున్నాయి? ఎన్ని రెన్యూవల్ అయ్యాయి? అనే సమాచారం కూడా జిల్లా విద్యాశాఖాధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఎంఈఓలు కూడా సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారంటే విషయం అర్థమైపోతోంది.

పుస్తకాల దందా..

ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల ధరలు కూడా అధికంగా ఉన్నాయి. ఏదైనా ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థి చేరితే ఆ పాఠశాల ప్రింట్ చేసిన నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు మాత్ర మే చదవాలి.. రాయాలి. బయట నుంచి కొను గోలు చేస్తే అనుమతించరు. బయట బుక్‌స్టాల్‌లో రూ.30కి దొరికే నోట్‌బుక్ రూ.50కి అమ్ముతున్నారు. వీటిని సమీపంలోని ఇళ్లు, షెట్టర్లలో పెట్టి విక్రయిస్తున్నారు. ఇక 6వ తరగతి నుంచి ఐఐటీ విద్యను బోధిస్తామని అదనంగా రూ.5 వేలు దండుకుంటున్నట్లు సమాచారం. కార్పొరేట్ పాఠశాల లు ఎల్‌కేజీ నుంచి రూ.లక్ష వసూలు చేస్తే, మిగతారావు సదుపాయాలను బట్టి రూ.30 నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నారు.

తనిఖీలు శూన్యం...

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, ప్రత్యేక కోర్సులంటూ తల్లిదండ్రుల నుంచి డబ్బు దోపిడీ జరుగుతుంటే జిల్లా విద్యాధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఒకరిద్దరు ఎంఈఓలు తనిఖీ చేశారు కానీ, మిగతా వారంతా కూడా ఎవరిపనిలో వారు ఉన్నారు. జిల్లా విద్యాధికారి కూడా ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేయలేదని సమాచారం. లక్షల్లో వసూళ్లు చేస్తున్నా కూడా ఒక్క పాఠశాలలో నిబంధనలుండవు. ఏ పాఠశాలలో కూడా ప్లేగ్రౌండ్ ఉండదు. ఆటపాటలుండవు. కేవలం చదువు..చదువు అంటూ వెంటపడతారు. ప్రైవేట్ పాఠశాలల వారు ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారనే విషయాలను పాఠశాల నోటీసు బోర్డుపై ఏర్పాటు చేయాలనే నిబంధనలున్నాయి. కానీ, ఏ పాఠశాల వారు కూడా ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టడం లేదు. యాజమాన్యాలు ఎంత చెబితే అంత ఫీజు కట్టాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పుస్తకాల దోపిడీ, అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల వారు అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేయాలి. పాఠశాలల్లో విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలి. ప్రత్యేక కోర్సులకు సంబంధించి అధిక ఫీజులు వసూలు చేసినా కూడా చర్యలు తీసుకుంటాం. ఎంఈఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి.

–ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

ఇరవెండిలో పోడు వివాదం..

ఫారెస్ట్ అధికారులు కందకాలు తవ్వుతుండగా అడ్డుకున్న గిరిజనులు


కందకాలు తవ్వకుండా జేసీబీని అడ్డుకుంటున్న మహిళలు

బూర్గంపాడు: ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లోని కొసగుంపు వలస ఆదివాసీ గ్రామంలో శుక్రవారం పోడు భూములపై వివాదం చోటుచేసుకుంది. కందకాలు తవ్వేందుకు వెళ్లిన జేసీబీని కొసగుంపునకు చెందిన వలస ఆదివాసీ మహిళలు అడ్డుకున్నారు. ఫారెస్ట్ అధికారులు మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికి వారు వినకపోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాము సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో కందకాలు తవ్వొద్దని మహిళలు కోరగా.. గ్రామపెద్దలతో చర్చించిన తర్వాతనే తవ్వకాలు చేపట్టామని ఫారెస్ట్ అధికారులు వివరించారు. వాగ్వాదం పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొనగా.. ఫారెస్ట్ అధికారులు తమపై దాడి చేశారని మహిళలు ఆరోపించారు. ఈ విషయమై అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేశ్‌ను వివరణ కోరగా.. కొసగుంపు గ్రామస్తులు, పెద్దలతో రెండు నెలలుగా చర్చించిన తరువాతనే సామరస్యంగా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళలు అక్కడకు వచ్చి పనులను అడ్డుకున్నారని, ఫారెస్ట్ సిబ్బందిని దుర్భాషలాడారని తెలిపారు. తిరిగి తామే దాడికి పాల్పడ్డామని ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఇదిలాఉండగా ఫారెస్ట్ అధికారులు తమపై దాడులకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని కొందరు మహిళలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, ఎస్‌ఐ రాజేశ్‌కు ఫిర్యాదు చేశారు.

సన్నబియ్యం తూకంలో తేడాలు

రేషన్‌షాపులో మాయాజాలం


54 కిలోలకు బదులు 50.100 కిలోలు చూపుతున్న దృశ్యం

ములకలపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం క్షేత్రస్థాయిలో అభాసుపాలవుతోంది. రేషన్ దుకాణంలో చేస్తున్న మాయాజాలంతో లబ్ధిదారులకు రావాల్సిన వాటికన్నా కొంతమేర కోత పడుతోంది. ములకలపల్లి రేషన్ దుకాణంలో ఈ నెల 1వ తేదీ నుంచి మూడు నెలలకు సరిపడా సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ఒకేసారి మూడు నెలలకు బియ్యం అందుతున్నాయని ఆనందిస్తున్న తరుణంలోనే, రావాల్సిన వాటి కంటే తగ్గువగా బియ్యం ఇస్తున్నారు. రేషన్ దుకాణంలోని యాభై కిలోల బియ్యం బస్తాలో ముందుకుగానే కొన్ని బియ్యం తీసి, లబ్ధిదారుడికి ఇచ్చే సమయంలో తూకం వేయకుండా ఇస్తున్నారు. గత బుధవారం పంపిణీ చేసిన ఇరువురికి బియ్యం తక్కువగా రావడంతో విషయం బయటపడింది. ఈ విషయమై ములకలపల్లి రేషన్ షాపు సేల్స్‌మెన్ అగ్గిరాంను వివరణ కోరగా.. రేషన్ సెంటర్‌కు వచ్చే యాభై కిలోల బియ్యం బస్తాల్లో బియ్యం ఎక్కువగా ఉంటున్నాయని, దీంతో బస్తా సీల్ తీసి, కొంతబియ్యం తీసి తూకం వేయకుండా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇకపై అన్ని బస్తాలూ తూకం వేసి, సక్రమంగా బియ్యం అందేలా చూస్తామని చెప్పారు.

మేరునగధీరులు.. దాశరథి, ఆరుద్ర

జాతీయ సదస్సులో వక్తలు


దాశరథి, ఆరుద్ర చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ సూర్య ధనుజంయ్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన దాశరథి, ఆరుద్ర తెలుగు సాహిత్య చరిత్రలో మేరునగధీరులుగా నిలిచారని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ అన్నారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన 'శతజయంతి సాహితీమూర్తులు' పేరిట దాశరథి – ఆరుద్రజీవితం సాహిత్యంపై నిర్వహించే రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సమావేశానికి వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఎల్.ఎన్.శాస్త్రి అధ్యక్షత వహించగా దాశరథి, ఆరుద్ర చిత్రపటాల వద్ద నివాళులర్పించాక వీసీ సూర్య ధనుంజయ్ తదితరులు మాట్లాడారు. తెలంగాణ పీడిత ప్రజల పక్షాన నిలిచి అక్షరమే ఆయుధంగా పోరాడిన యోధుడిగా దాశరథి తిమిరంతో సమరం చేశారని చెప్పారు. భూమి కోసం భుక్తి కోసం పోరాడిన బడుగు వర్గాలకు స్ఫూర్తినిచ్చారని తెలిపారు. ఇక ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య పరిశోధనతో చరిత్రను లోతుగా అధ్యయనం చేసి అరుదైన పరిశోధకుడిగా నిలిచారని కొనియాడారు. నేటి యువత వీరిద్దరి సాహిత్యంపై అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం దాశరథి, ఆరుద్ర సాహిత్యంపై ఓయూ తెలుగు శాఖాధిపతి ప్రొఫెసర్ సాగి కమలాకరశర్మ, సాహిత్య విమర్శకులు కవి రెంటాల వెంకటేశ్వరరావు కీలకోపన్యాసం చేశారు. ఈకార్యక్రమంలో కేయూ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ బన్న ఆయిలయ్య, కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుతో పాటు రవిమారుత్, ప్రేసేన్, బానోత్ రెడ్డి, డాక్టర్ సునంద, డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ సీతారాం, డాక్టర్ జె.అనురాధ, కిరణ్‌కుమార్, డాక్టర్ ఎం.వీ.రమణ, డాక్టర్ కార్తీక్, కోటమ్మ, శ్రీ నివాస్ మాట్లాడగా వివిధ ప్రాంతాల అధ్యాపకులు 30మంది పత్రాలు సమర్పించారు.

రూ.63లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం సంభానీనగర్‌కు చెందిన షేక్ అన్వర్‌జానీ రూ.63 లక్షలకు దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా పలువురి వద్ద నగదు అప్పు తీసుకున్నాడు. ఇప్పుడు అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ పది మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా శుక్రవారం ఖమ్మం సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

ఒలింపిక్ రన్ సక్సెస్


ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, పీఓ, ఏఎస్పీ తదితరులు

భద్రాచలంటౌన్: పట్టణంలో అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపిక్ రన్ విజయవంతమైంది. పాల్వంచలో మొదలైన రన్ దమ్మపేట మీదుగా భద్రాచలం వరకు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ రాహుల్, ఏఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి మాట్లాడారు. పట్టణంలో త్వరలో 400 మీటర్ల అథ్లెటిక్స్ ట్రాక్ కోసం ఐదెకరాల స్థలం సేకరించనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ బాధ్యులు మహిధర్, నాగ సీతారాములు, వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, గిరి ప్రసాద్, దాట్ల రాజు, కుంచాల రమేష్, ఉదయ్ కుమార్, రామి రెడ్డి, శ్వేత, దుర్గారావు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేసిన ఎస్పీ


రూ.కోటి చెక్కును అందజేస్తున్న ఎస్పీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ టి.అనిల్‌కుమార్ కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.కోటి చెక్కును ఎస్పీ రోహిత్‌రాజ్ చేతుల మీదుగా శుక్రవారం అందజేసింది. పోలీస్ వేతన ప్యాకేజీ అకౌంట్ ద్వారా యూనిఫామ్ సర్వీస్ కస్టమర్ల సంక్షేమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన స్కీం ద్వారా వచ్చిన నగదును అనిల్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, చీఫ్ మేనేజర్ ఆంజనేయ రమేష్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఇన్సూరెన్స్' ద్వారా మరో రూ.కోటి

పాల్వంచ డీఎస్పీ కార్యాలయంలో పోలీస్ కానిస్టేబుల్ తన్నీరు అనిల్‌కుమార్ 2024, డిసెంబర్‌లో జరిగినరోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన 2022 సెప్టెంబర్‌లో టాటా ఏఐఏ టర్మ్ ఇన్సూరెన్స్ ద్వారా పాలసీ తీసుకోవడంతో నామినీగా ఉన్న తన్నీరు నాగలక్ష్మి ఈ ఏడాది జనవరి 8న అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించగా.. రూ.కోటిని ఆమె బ్యాంక్ ఖాతాలో జమచేశారు. కార్యక్రమంలో బీఎం జక్కుల సతీష్, రాహుల్, నాగేంద్రరెడ్డి, కొచ్చెర్ల కమలారాణి, భూక్య తారాప్రసాద్, డి.శివప్రసాద్, రాములు, ఆనంద్‌వర్ధన్, అనిల్, శివ లీల, సుమన్, నాగలక్ష్మి, పావని, మహేశ్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కుల కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కులు చెల్లకపోవడంతో వరంగల్‌కు చెందిన తొడుకునూరి రత్నాకర్, మహమ్మద్ హిమాయత్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బిక్కం రజని తీర్పు చెప్పారు. శుక్రవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలు... ఖమ్మం పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన చుక్కల సరళాదేవికి చెందిన స్థలాలను కమీషన్ పద్ధతిపై అమ్ముతామని నమ్మించిన రత్నాకర్, అలీ జీపీఏ చేయించుకున్నారు. ఆపై స్థలాలు అమ్మినా సరళకు డబ్బు ఇవ్వకపోగా, పలుమార్లు అడిగాక చెరో రూ.30 లక్షల చొప్పున చెక్కులు జారీ చేశారు. కానీ వారి ఖాతాల్లో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ఆమె న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం ఇద్దరికి ఏడాది జైలుశిక్ష విధించడమే తో పాటు ఫిర్యాదికి చెరో రూ.30 లక్షలు చెల్లించాలని న్యాయవాధికారి తీర్పు చెప్పారు.

అంతా ఔట్ సోర్సింగే..

- రెగ్యులర్ ఉద్యోగులు లేరు..
- మార్కెట్ల ఆదాయ మార్గాలే చెక్ పోస్టులు..
- జిల్లాలో కొత్తగూడెం, దమ్మపేట, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, ఇల్లెందు మార్కెట్లు


కొత్తగూడెం క్రాస్‌రోడ్‌లోని మార్కెట్ చెక్ పోస్టు

ఇల్లెందు: మార్కెట్ యార్డులకు ఆదాయం కలిగిన చెక్ పోస్టులన్నీ ఏళ్లతరబడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో నడుస్తున్నాయి. కోట్ల రూపాయల ఆదాయం కలిగిన మార్కెట్ యార్డులు పటిష్టపర్చటంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలోని ఆరు మార్కెట్ కమిటీల పరిధిలో 18 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఏ ఒక్క మార్కెట్ చెక్ పోస్టులో కూడా రెగ్యులర్ ఉద్యోగులు లేరు. ఇతర సూపర్‌వైజర్ పోస్టులు కూడా చాలావరకు ఔట్ సోర్సింగ్ వారితో నెట్టుకొస్తున్నారు. ఇక భద్రాచలం లాంటి మార్కెట్‌లో ఇద్దరు ఉద్యోగులు ఉన్నా మహిళలే కావటంతో పర్యవేక్షణ కష్టంగా మారింది. దీనికి తోడు ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో ఆదాయం కోసం ఏర్పాటు చేసుకున్న చెక్ పోస్టుల్లో చాలా వరకు పైసా వసూలు చేయని చెక్ పోస్టులుఉన్నాయి. అలాంటి వాటిని మార్చకుండామరో మార్గంలో ఏర్పాటు చేయకుండా ఆదాయం లేని చెక్ పోస్టులను నేటికీ కొనసాగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్నీ వ్యవసాయ మార్కెట్‌లు సీజనల్‌గా సాగేవే ఉన్నాయి. ఏడాది పొడవునా ఏ ఒక్క మార్కెట్‌లో క్రయ విక్రయాలు సాగటం లేదు. మార్కెట్‌లకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం సాంధించాలంటే చెక్ పోస్టులపై ఆధారపడాల్సిందే. ఈ తరుణంలో చెక్ పోస్టులు కీలకంగా మారుతున్నాయి. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, దమ్మపేట, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, ఇల్లెందు మార్కెట్‌యార్డులున్నాయి. సీజనల్ మార్కెట్‌లు కావటంతో పాటు సిబ్బంది సరిపడా లేకపోవటం వల్ల పర్యవేక్షణ కరువైంది. ఎన్నో రకాల పంట ఉత్పత్తులను మార్కెట్‌లో క్రయవిక్రయాలు చేసుకునే అవకాశం ఉంది. కానీ, ఏ ఒక్క అధికారి కూడా ఆ మార్కెట్ సాగేలా ప్రణాళిక రూపొందించడం లేదు. రాజకీయ ఒత్తిళ్లు కూడా తోడవుతున్నాయి. ఎక్కడైనా వ్యాపారులు మార్కెట్‌కు రావాలంటే అక్కడ రాజకీయ ఒత్తిడి మొదలవుతోంది. దీంతో అధికారులు ఆదాయం రాబట్టుకునేందుకు పాటుపడుతున్నారు. జిల్లాలో కొన్ని చెక్ పోస్టులు అధిక ఆదాయం కలిగిఉన్నాయి. సరిహద్దు చెక్ పోస్టులు పటిష్టంగా ఏర్పాటు చేస్తే ఆదాయం మెరుగవుతుంది. 2025–26 సంవత్సరంలో రూ.22.65 కోట్ల లక్ష్యానికి గాను రూ.21.69 కోట్లు సాధించారు.

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది, గత ఏడాది మార్కెట్లకు నిర్దేశించిన లక్ష్యం, అవి సాధించిన లక్ష్యం ఇలా ఉంది..

జిల్లాలో చెక్ పోస్టులు ఇలా..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆరు మార్కెట్ యార్డులు ఉండగా 18 వరకు చెక్ పోస్టులు ఉన్నాయి. కొత్తగూడెంలో–3, ఇల్లెందులో–4, దమ్మపేటలో–2, బూర్గంపాడులో–4, చర్లలో–4, భద్రాచలంలో–1 ఉన్నాయి. ఇల్లెందు మార్కెట్ పరిధిలోని సుదిమళ్ల చెక్ పోస్టు ద్వారా 2014–15లో రూ.51.72 లక్షలు, 2015–16లో రూ.62.70 లక్షలు, 2016–17లో రూ.56.40 లక్షలు, 2017–18లో రూ.28.34 లక్షలు, 2018–19లో రూ.13.48 లక్షలు, 2019–20లో 20.31లక్షలు, 2020–21లో రూ.5.77 లక్షలు, 2021–22లో రూ.26.84 లక్షలు, 2022–23లో రూ.2.88 లక్షలు, 2023–24లో రూ.2.76 లక్షలు, 2024–25లో రూ.38.54 లక్షలు, 2025–26లో రూ.1.82 లక్షల ఆదాయం లభించింది. భద్రాచలం ,బూర్గంపాడు, కొత్తగూడెం చెక్ పోస్టుల్లో ఆదాయం లేదు. ఇల్లెందు, చర్ల, దమ్మపేట చెక్ పోస్టులు ఆదాయం సమకూరుస్తున్నాయి.

మార్కెట్	గత ఏడాది లక్ష్యం	ఈ ఏడాది లక్ష్యం
బూర్గంపాడు	5.86 కోట్లు	6.25 కోట్లు
దమ్మపేట	3. 25 కోట్లు	3.67 కోట్లు
ఇల్లెందు	4.64 కోట్లు	5.16కోట్లు
భద్రాచలం	2. 00 కోట్లు	1.94 కోట్లు
కొత్తగూడెం	3. 30 కోట్లు	3.47 కోట్లు
చర్ల	2.62 కోట్లు	2.12 కోట్లు
	21.69 కోట్లు	22. 65 కోట్లు

సమన్వయం చేస్తే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆరు మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ మార్కెట్ యార్డులన్నీ బలోపేతం చేసి సరుకు తరలి వెళ్లే రహదారులను గుర్తించి ఆ మార్గాల్లో చెక్ పోస్టులు నెలకొల్పితే మార్కెట్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.ఈ మార్కెట్ కమిటీలోని చెక్ పోస్టులుఆదాయం లభించనివి కూడా ఉన్నాయి. వాటిని తొలగించిఆదాయ మార్గాలు ఉన్న చోట ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుంది. ముఖ్యంగా సమన్వలోపం కారణంగా వ్యవసాయ మార్కెట్‌లు క్రయవిక్రయాలు లేకుండా పోతున్నాయి.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

మణుగూరుటౌన్: బీటీపీఎస్ యాష్ ప్లాంట్ నుంచి బూడిద కట్టల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పినపాక మండ లం బోటిగూడెం పంచాయతీ మారేడుగూడెంనకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామారావు (48).. బీటీపీఎస్ యాష్‌ప్లాంట్ నుంచి బూడిద కట్టలను మరో చోటికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. మార్గమధ్యలో చెరువుకట్ట పైనుంచి అదుపుతప్పి 15 అడుగుల లోతులో ట్రాక్టర్ బోల్తా పడటంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు 100 పడకల ఆస్పత్రికి తరలించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ యయాతిరాజు

అశ్వారావుపేటరూరల్: ఓ ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరిని శుక్రవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్ట్ వద్దగల శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 12వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీల తాళాలను ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించిన సంగతి తెలిసిందే. కాగా, అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కమ్మరిగూడేనికి చెందిన సబ్కా కాంతారావు, పాయం అనిల్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

21 కేజీల గంజాయి పట్టివేత


నిందితులు, గంజాయిని చూపుతున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: కారులో తరలిస్తున్న 21 కేజీల గంజాయిని కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి టౌన్ పోలీసులు పట్టుకున్నారు. టౌన్ ఎస్‌ఐ సతీశ్ సిబ్బందితో కలిసి కూనవరం రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ కారును ఆపి తనిఖీ చేశారు. అందులో 21 కేజీల గంజాయి లభించింది. హైదరాబాద్‌కు చెందిన బాలకృష్ణ, వెంకటేశ్ ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయి విలువ రూ.12 లక్షలు ఉంటుందని, నిందితుల ఫోన్‌లు సీజ్ చేసి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.